## నవంబర్ 14న స్వరబ్రహ్మ కే.వి.మహదేవన్ కు సిలికాన్ వ్యాలీలో స్వరార్చన

స్వరబ్రహ్మ కె. వి. మహదేవన్. ఆయన ముద్దుపేరు మామ. ఆయన సుస్వరాల రసాల ఊట. అందులోనుండి ఎన్ని సుమధుర స్వరాలు వెలికి తీసినా ఇంకాఇంకా వస్తూనే ఉంటాయి. టెలిఫోన్ డైరెక్టరీలో ఒకపేజీ చింపి ఇస్తే అందులో ఉన్న పేర్లన్నీ కలిపి ఒక గొప్ప బాణీ కట్టగలడని ఆయన గురించి చమత్కారం! తెలుగు చలన చిత్రసంగీతంలో రాశిలోను వాసిలోను మేటియైనవారిలో ఒకేఒక్కరిని ఎంచుకోమంటే నూటికి తొంభైమంది మామ మహదేవన్ గారినే ఎంచుకుంటా రనటంలో అతిశయోక్తి లేదు. అంతటి సుప్రసిద్ధ సంగీతదర్శకుడు అందించిన వందల వేల ఆణిముత్యాలలో కేవలం ఇరవై రెంటితో మాత్రమే సరిపెట్టుకోవటం తేలికైన పనికాదు. ఆ సాహస కార్యక్రమాన్ని తన భుజస్కంధాలపై మోపుకొని విజయవంతంగా నిర్వహించిన చిమటమ్యూజిక్.కామ్ అధినేత శ్రీ చిమట శ్రీనివాసరావు నిజంగా అభినందనీయుడు. "ఝుమ్మంది నాదం" పేరుతొ వెలువడిన ఈ కార్యక్రమం నిజంగా ప్రేక్షకుల మదిలో తుమ్మెద ఝూంకారంలా మారుమ్రోగింది.

పాడినవారందరూ ప్రతిఫలాపేక్ష లేకుండా సమయం వెచ్చించి అభ్యసించి పాడటం నిజంగా కళపై వారికున్న అభిమానాన్ని చాటుతుంది. ముఖ్యంగా సుప్రసిద్ధ గాయకుడు, అమెరికా ఘంటసాల బిరుదాంకితుడు శ్రీ రాజు ఈడూరి (శాక్రమెంటో) మరియు సుప్రసిద్ధ గాయని, గాయకరత్న బిరుదాంకితురాలు, శ్రీమతి మణి శాస్త్రి (హ్యూస్టన్) వేర్వేరు ప్రాంతాల నుండి ఈ కార్యక్రమంకోసం రావటం నిజంగా ప్రేక్షకుల అదృష్టం. వారిద్దరినీ వేదికపై ప్రత్యేకంగా సత్కరించి శ్రీని చిమట తన కృతజ్ఞతలు తెలుపుకున్నారు. కార్యక్రమానికి ఆయువుపట్టైన ఆర్కెస్ట్రా సభ్యులు శ్రీయుతులు కృష్ణమూర్తి "కిష్మూ" కాల్వె (కీబోర్డ్), నాగరాజ్ వరదరాజన్ (కీబోర్డ్), అశ్విన్ కృష్ణకుమార్ (వేణువు), ఫర్హాన్ మహమ్మద్ (గిటార్), అరుణ్ "క్యాడీ" నరసింహన్ (డ్రమ్స్), బాలాజీ మహదేవన్ (ఢోలక్), మరియు సత్య వైద్యనాథన్ (తబల) అందరూ భాషేతరులైనా అన్నిపాటలకు చాలా అద్భుతంగా వాయించి అందరినీ సంగీతరసంలో ఓలలాడించారు. కళకు ఎల్లలు లేవని మరోసారి నిరూపించారు. ఈ కార్యక్రమంలో మరో విశేషమేమిటంటే ప్రేక్షకులకు పాటలతోనేగాక మాటలతో కూడా వినోదం కలగజేయటానికి వేదికపై యాంకర్స్ శ్రీ వంశీ ప్రఖ్యా మరియు శ్రీమతి లక్ష్మీ కాత్యాయని ధూళిపాళ కలిసి ఎంతో కృషి చేశారు. వినోదంతోబాటు విజ్ఞానంగా పాటపాటకు మధ్య మహదేవన్ గారి గురించి ఇంకా ఎందరో సినీప్రముఖుల గురించి మనకు తెలియని ఎన్నో విషయాలు కూడా తెలియజెప్పారు.

ఇక పాడిన పాటల గురించి ఎంతైనా చెప్పుకుంటూ పోవచ్చుగాని స్థలాభావం కారణంగా ఇక్కడ కేవలం కొన్ని మచ్చుతునకలు మాత్రమే చెప్పుకోగలము. మనసును ఊరడించే జోలపాట "పాడుతా తీయగా" (మూగ మనసులు) రాజుగారు పాడితే మణిగారు "మనసుని కోవెలగా" చేసిన (మాతృదేవత) కోయిల అయ్యారు. వారిద్దరూ కలిసి ప్రేక్షకులపై "చిటపట చినుకులు" (ఆత్మబలం) కురిపించడమే కాకుండా "చెంగావి రంగుచీరతో" (బంగారు బాబు) ఉయ్యాల కట్టి ఒక ఊపు ఊపి వదిలారు. మురళి సంబర "శంకరా నాదశరీరాపరా" (శంకరాభరణం) అని పాడితే ఆ శివగంగ నిజంగానే ఈ ధరకు జారింది. ఆశ్చర్య మనిపించవచ్చుగాని మహామహా గాయకద్వయమైన శ్రీ ఘంటసాల మరియు శ్రీ బాలసుబ్రహ్మణ్యం గార్లు కలిసి పాడిన పాటలు ఐదేఐదు! వాటిలో అత్యంత ప్రముఖమైన "ప్రతిరాత్రి వసంతరాత్రి" (ఏకవీర) పాటను గాయకులు శ్రీయుతులు ప్రసాద్ దుర్వాసుల మరియు విజయ్ వేమూరి కలిసి పాడారు. కార్యక్రమ గీతమైన "ఝుమ్మంది నాదం" (సిరిసిరి మువ్వ) మణిగారితో కలిసి శ్రీ రవి తాతా పాడితే కరతాళ ధ్వనులతోబాటు మరొక్కసారి (వన్స్ మోర్) అంటూ ప్రేక్షకులు కోరారు. వారి కోరిక మన్నించి కార్యక్రమాంతంలో మరలా ఆ పాట పాడటం గొప్ప విశేషం. జానపద గేయంగా పుట్టి సినీగీతంగా మారిన "మొక్కజొన్న తోటలో" (అదృష్టవంతులు) పాటని శ్రీమతి హేమమాలిని కోటా లయబద్ధంగా పాడితే అన్నమాచార్యుని పన్నెండు రాశుల వర్ణన కీర్తన "ఇన్ని రాశుల యునికి" (శృతిలయలు) శ్రీమతి

సుధ శాస్త్రి ఆనాటి గాయని వాణి జయరాంగారిని గుర్తింపజేస్తూ రవి తాతా తో కలిసి పాడారు.సిరివెన్నెల సినిమా నుండి "విధాత తలపున" పాటలో వాద్యకారుడు అశ్విన్ కృష్ణకుమారుని వేణుగానానికి ముగ్ధులైన ప్రేక్షకులు ప్రత్యేకంగా కరతాళ ప్రశంసలందజేశారు.  ఇలా చెప్పుకుంటే ఎన్ని ఆణిముత్యాలో!

ఆరు నెలల క్రిందట సంగీత దర్శకుడు శ్రీ సత్యంగారి పాటలమీద జరిగిన వేడుక మాదిరిగనే ఈ కార్యక్రమానికి కూడా 1200మందికి  పైగా హాజరయ్యారు. కౌముది పత్రిక సంస్థాపకులు శ్రీ కిరణ్ ప్రభ గారు తన ప్రసంగంలో శ్రీని చిమటను ఇటువంటి మహత్తర సంగీత కార్యక్రమాలను చేపట్టినందుకు ప్రశంసించారు. ఇక మీదట జరగబోయే కార్యక్రమాలకు కూడ ఇటువంటి ఆదరణే లభించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆర్థికంగను, శ్రామికంగాను తోడ్పడిన పలువురు వ్యక్తులకు సంస్థలకు శ్రీని చిమట తన కృతజ్ఞత లందజేశారు. మరొక ఆరు నెలలలో సుప్రసిద్ధ సంగీత దర్శకుడు శ్రీ ఇళయరాజా గారి పాటలతో మరలా ముందుకొస్తానని మాట ఇచ్చారు.